

విధాత.. వరదాత

మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ సత్యం, అహింసా మార్గాలను అనుసరించాలని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున నివాళి అర్పించారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆయనతోపాటు కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, తిరుపతి (నగరం)



శ్రీవారి దర్శనానంతరం కుమార్తెలతో కలిసి వస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

నేడు వారాహి బహిరంగ సభ



వారాహి వాహనం

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వారాహి డిక్లరేషన్ ప్రకటించి శంఖం పూరించనున్నారు. ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా బుధవారం శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు తిరుపతి బాలాజీ కాలనీలోని జ్యోతిరావు పులే కూడలిలో జరగనున్న వారాహి సభలో ప్రసంగించనున్నారు. వారాహి వాహనం ఇప్పటికే తిరుపతి చేరుకుంది. సభాస్థలిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి కేకే శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ సందర్శించారు.

నేటి నుంచి టెట్

తొమ్మిది కేంద్రాల ఏర్పాటు | హాజరుకానున్న 37,610 మంది

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) గురువారం నుంచి ఈనెల 21 వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. జిల్లాలోని 9 కేంద్రాల్లో 37,610 మంది హాజరుకానున్నారు. తిరుపతిలో జూపార్క్ రోడ్డులోని ఐడీజెడ్ కేంద్రం, రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి, కరకంబాడి మార్గంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నారు. చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లెలోని ఇన్ డిజిటల్ జోన్, గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, విద్యానగర్‌లోని మరో రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. పుత్తూరులోని శ్రీవెంకటేశ పెరుమాళ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాలలో కేంద్రం ఏర్పాటు చేశారు. దివ్యాంగులు 87 మంది ఉండగా వీరికి సహాయకులను నియమించారు. టెట్ పరీక్షల్లో అర్హత పొందినవారికి ఇందులోని మార్కులు డీఎస్సీలో వెయిటేజ్ రూపంలో ఉపయోగపడనున్నాయి.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా బుధవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 12 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. మంగళవారం శ్రీవారిని 69,300 మంది దర్శించుకున్నారు. రూ.4.23 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

బ్రహ్మాండ వేడుక.. భక్తజనులూ రండిక

శ్రీవారి సన్నిధి బ్రహ్మోత్సవ వేడుకలకు సిద్ధమైంది. నవహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ఈనెల 12 వరకు జరగనున్న నేపథ్యంలో లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం తితిదే అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. వాహన సేవలు వీక్షించేందుకు వీలుగా మాడవీధుల్లో గ్యాలరీలు క్యూలైన్లు సిద్ధం చేశారు.

- న్యూస్‌టుడే,తిరుమల



డిస్పెన్సరీలు.. అత్యవసర వైద్యసేవల కోసం తితిదే వైద్యవిభాగం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా 8 ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే తిరుమల, తిరుపతిలో శాశ్వతంగా ఆరు డిస్పెన్సరీలు ఉన్నాయి. మందులు, అత్యాధునిక వైద్య పరికరాలతో అంబులెన్సులను సిద్ధం చేశారు.



ప్రథమ చికిత్సల టెంట్

విస్తృత ఏర్పాట్లు చేపట్టిన తితిదే

నిరంతరాయంగా అన్న ప్రసాదాలు

ప్రతి గ్యాలరీ వద్ద ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాదాలు, సాయంత్రం టీ, పాలను శ్రీవారి సేవకులు అందిస్తారు. ఎప్పటికప్పుడు కార్మికులు వ్యర్థాలు తొలగిస్తారు. తితిదే అన్నదానం డిప్యూటీ ఈవో రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి నిత్యం పర్యవేక్షిస్తారు. మాతృశ్రీ తరిగొండ అన్నప్రసాద కేంద్రం, తిరుమల వ్యాప్తంగా పలు కేంద్రాల వద్ద అన్నప్రసాదాలు నిరంతరాయంగా అందిస్తారు.



దర్భచాప, తాడుతో డీఎఫ్‌వో శ్రీనివాసులు, తితిదే పారుపత్తేదారు బాల, అటవీశాఖ ఉద్యోగులు

గ్యాలరీల్లో జలప్రసాదం

గ్యాలరీలకు చేరుకునే లక్షలాది మంది భక్తుల కోసం అన్నప్రసాదాలు, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. కీలకమైన గరుడోత్సవం రోజున భక్తులకు అదనంగా కేటాయించనున్నారు. గ్యాలరీల్లో తితిదే జలప్రసాదం అందుబాటులోకి తెచ్చారు. మాడవీధుల్లోని ఆరు ప్రదేశాల్లో 98 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. శిలాతోరణం, కృష్ణతేజ వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు ఉన్నాయని తితిదే ఆరోగ్యాధికారి మధుసూదన్ తెలిపారు.



గ్యాలరీల్లో తితిదే జలప్రసాదం



కంకణ భట్టాచార్యులుగా గోవిందాచార్యులు

బ్రహ్మోత్సవాల్లో క్రతువులు, వైదిక కార్యక్రమాల నిర్వహణకు కంకణ భట్టాచార్యులుగా గోవిందాచార్యులు వ్యవహరించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో హోమాలు, వాహనసేవల్లో పూజా కార్యక్రమాలు, వివిధ ఉత్సవాలను ఆయన ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యేంతవరకు ఆయన పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు.



శ్రీవారి ఆలయ మాడవీధుల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు

అంకురార్పణకు సర్వం సిద్ధం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 7 నుంచి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణ జరగనుంది. గురువారం భగవన్నారాయణుని సేనాధిపతి విష్వక్సేనుడు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. శుక్రవారం సాయంత్రం 5.45 నుంచి 6.00 గంటల మధ్య మీనలగ్నంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణ జరుగుతుంది.

దర్భచాప, తాడు ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణానికి ఉపయోగించే దర్భచాప, తాడును తితిదే అటవీ విభాగం కార్యాలయం నుంచి డీఎఫ్‌వో శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయానికి బుధవారం తీసుకువచ్చారు. రంగనాయకుల మండపంలో శేష వాహనంపై దర్భతో తయారు చేసిన చాప, తాడును ఉంచారు. ఈ దర్భను కైంకర్యాలు, సేవలు, హోమాల్లో వినియోగిస్తారు. వీటిని ఏర్పేడు మండలం చెల్లూరులో సేకరించారు.



కనకాచలం.. ధగద్ధాయమానం

ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న కనకాచలం శరన్నవరాత్రి వార్షిక ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ సందర్భంగా కనకాచలం విద్యుద్దీప శోభతో భక్తులకు స్వాగతం పలికేందుకు సిద్ధమైంది. పది రోజుల పాటు భక్తులతో సందడిగా మారనుంది.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న నేపథ్యంలో తిరుమలలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, డీఐజీ షేముషి బాజ్‌పాయ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రాంభగీచా అతిథిగృహం ఎదురుగా పోలీసు, తితిదే భద్రతా విభాగాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్‌వో శ్రీధర్, అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, నాగభూషణరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, తిరుమల డీఎస్పీ విజయ్‌శేఖర్ పాల్గొన్నారు. **రేణిగుంట:** ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ వెంకటేశ్వర్.. బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో ఎస్పీ సుబ్బరాయుడితో సమీక్షించారు. పర్యటన సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాకపోకలు సాగించే మార్గాల్లో క్షుణ్నంగా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న డీఐజీ షేముషి బాజ్‌పాయ్, చిత్రంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్‌వో శ్రీధర్, ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తదితరులు

ఎన్నికల్లేక.. నిధులు రాక

- ఆర్థిక సంఘం నిధులకు కేంద్రం కొర్రీ
- మొదటి శ్రేణి పురపాలికలకు ఆగిన రూ.12 కోట్లు



శ్రీకాళహస్తి పురపాలికలో బిల్లులు ఇవ్వకపోవడంతో ఆగిన కన్నలి కాలువ

ఎన్నికలు చేపట్టని సంస్థలు	పట్టణ జనాభా	ఏర్పాటైన సంవత్సరం	వార్డులు
గూడూరు	93,191	1951	34
శ్రీకాళహస్తి	90,692	1958	35

పురపాలిక ఎన్నికల జాప్యం కారణంగా రూ. కోట్లలో గండి పడింది. గత వైకాపా ప్రభుత్వం నిర్వాకంతో పట్టణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు అడ్డంకిగా మారింది. ఈ ఏడాది విడుదల చేసే నిధులు నిలుపుదల చేసింది. దీంతో పట్టణాల్లో అభివృద్ధి కుంటు పడే పరిస్థితి ఏర్పడింది. **- న్యూస్‌టుడే, గూడూరు, గూడూరు పట్టణం**

వసతుల కల్పనకు విఘాతం

శ్రీకాళహస్తి పురపాలక సంఘం 1958లో ఏర్పాటు కాగా 35 వార్డులు ఉన్నాయి. ఇక్కడ 2021లో నిర్వహించాల్సిన ఎన్నికలు వైకాపా ప్రభుత్వం వాయిదా వేసింది. దీంతో ఈ ఏడాది అందాల్సిన ఆర్థిక సంఘం నిధులు రూ.6 కోట్ల మేర ఆగిపోయినట్లు సమాచారం కాగా మౌలిక వసతుల పనులకు విఘాతం. కాగా మళ్లీ ఎన్నికల నిర్వహించే వరకు ఆర్థిక సంఘం నిధులు వచ్చే పరిస్థితి లేదు.

వైకాపా పాలకుల నిర్లక్ష్యంతోనే..

గూడూరు పురపాలక సంఘం 1951లో ఏర్పాటైంది. 90 వేల పైగా జనాభా, 34 వార్డులున్న సంస్థలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రథమ గ్రేడ్‌లో ఉన్న పురపాలక సంఘం అయినా నిధులు తీసుకురావడం.. వాటిని వినియోగించడంలో విఫలమవుతున్నారు. 2021లో జరపాల్సిన ఎన్నికలు కోర్టు కేసుల నేపథ్యంలో వాయిదా వేశారు. విలీన గ్రామాల వివాదంతో ఎన్నికలు ఆపేశారు. తదుపరి చర్యలు తీసుకుని ఎన్నికలు నిర్వహించడానికి వైకాపా భయపడింది.

ఆదాయం రెట్టింపు నిబంధనే కారణం

ఆస్తి పన్ను ఆదాయం రెట్టింపులో ఇదే తీరుగా ఉంది. ఏటా ఆస్తి పన్నుల ఆదాయం రెట్టింపు చేయాలన్న నిబంధన పెట్టడంతో ఇది నిధులు వెనక్కి వెళ్లడానికి కారణంగా తెలుస్తోంది. రెండు పట్టణాలు ఏర్పాటై సుమారుగా 60 ఏళ్లు పైబడ్డాయి. చాలా మంది పురపాలక అధ్యక్షులుగా పనిచేసిన పరిస్థితి కాగా పట్టణాలు విస్తరించాయి. అదే విధంగా ఐదేళ్లలో పట్టణాల్లో వైకాపా ప్రభుత్వం వసతులను దూరం చేసింది. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆపేసి నట్టేట ముంచేసింది. ఇక్కడ తాగునీటి పథకాలు నిర్వీర్యం చేసింది. ఇలా పట్టణ స్థానిక సంస్థలు వైకాపా గుప్పెట్లో చిక్కి శల్యమయ్యాయి.

రూ. 6 కోట్లు రాలేదు

ఈ ఏడాది అందాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6 కోట్లు రాలేదు. గతంలో వచ్చిన నిధులు అమృత్, ఇతర పథకాలకు వాడాం.

- వెంకటేశ్వర్లు, పురపాలక కమిషనర్

దరఖాస్తులకు 'సెంటిమెంట్' అడ్డు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: మద్యం దుకాణాల కేటాయింపు నిమిత్తం దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానించగా రెండు రోజులుగా స్పందన కరవైంది. మొదటిరోజు మంగళవారం, రెండో తేదీ అమావాస్య కావడంతో దరఖాస్తుదారులు పెద్దగా ముందుకు రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం విధానం ప్రకటించి ఈనెల 1 నుంచి 9 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానంలో దరఖాస్తులు స్వీకరించనుంది. నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం మూడు దరఖాస్తులు అందినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి నాగమల్లీశ్వరరెడ్డి తెలిపారు.



లెక్కచేయమని దుక్కిదున్ని

- శోత్రియ భూముల్లో కబ్జాపర్వం
- హెచ్చరిక బోర్డులున్నా బేఖాతరు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: శోత్రియ భూముల్లో మళ్లీ ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ఇక్కడ తరచూ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తూనే ఉన్నా, ఆక్రమణదారులకు లెక్కలేదు. మండలంలోని చిన్నపాండూరులోని శోత్రియ భూములపై 'భూ'చోళ్ల చూపు పడింది. ప్రభుత్వాదేశాలను బేఖాతరు చేస్తూ, తాజాగా రాత్రికి రాత్రే కొందరు ఈ భూములను దుక్కిదున్ని ఆక్రమించారు.

భారీ పరిశ్రమల ఏర్పాటు

మండలంలోని చిన్నపాండూరు పంచాయతీ వీకేఆర్‌పై కాలనీ సమీపంలో పాదిరికుప్పం రెవెన్యూ పరిధిలో సుమారు 1,060 ఎకరాల శోత్రియ భూములున్నాయి. వీటిలో సుమారు 500 ఎకరాలను స్థానికులు గత నలభై ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. మిగిలిన భూములు ఖాళీగా ఉన్నాయి. అయితే 2016లో అప్పటి తెదేపా హయాంలో వీకేఆర్‌పై కాలనీలో అపోలో పరిశ్రమ, దాని పక్కనే హీరో మోటార్స్ పరిశ్రమ వంటి భారీ పరిశ్రమల ఏర్పాటుతో ఇక్కడ భూములకు ఎనలేని డిమాండ్ ఏర్పడింది.

విస్తరిస్తున్న ప్రాంతం

వివిధ వ్యాపారాలు విస్తరించగా, అపార్ట్‌మెంట్లు, విలాస హోటళ్లు, రెస్టారెంట్లు, బహుళ అంతస్తుల భవనాలతో ఈ ప్రాంతం అనూహ్యంగా పట్టణ స్థాయిలో అభివృద్ధి చెందింది. దీంతో శోత్రియ భూములకు మరింత డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా గత కొన్నాళ్లుగా స్థానిక రాజకీయ నాయకులు, రెవెన్యూ అధికారుల సహకారంతో ఈ భూములను కొద్దికొద్దిగా ఆక్రమిస్తూ వచ్చారు. అనధికారికంగా క్రయ విక్రయాలు చేస్తున్నారు. ఈ భూములను అక్రమార్కులు ఆక్రమిస్తూ, దుక్కి దున్నడం.. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం రివాజుగా మారింది.



చిన్నపాండూరులో ఆక్రమించి దుక్కిదున్నిన భూములు

ఏపీఐఐసీకి అప్పగింత?

2014-2019 మధ్య నాటి తెదేపా హయాంలో ఈ భూములను ఏపీఐఐసీకి కేటాయించేందుకు రంగం సిద్ధమైంది. వీటిని ఏపీఐఐసీ ద్వారా మరిన్ని పరిశ్రమలను ఏర్పాటు చేసేలా పారిశ్రామిక వాడగా ఏర్పాటు చేసేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. అయితే ఈ ప్రక్రియ సాగుతుండగానే ఎన్నికలు రావడం వైకాపా అధికారంలోకి రావడంతో ఈ ప్రక్రియ అటకెక్కింది.

పరిహారం కొట్టేసేందుకు యత్నం


తాజాగా తెదేపా నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పారిశ్రామికవాడ ప్రక్రియకు ఊపిరి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ భూములపై గత నలభై ఏళ్లుగా ఎలాంటి రెవెన్యూ రికార్డులు, పట్టాలు లేకుండా అనధికారికంగా అనుభవిస్తున్న స్థానికులకు ప్రభుత్వం పరిహారం అందించే అవకాశాలు ఉండటంతో, ఆక్రమణదారుల చూపు దీనిపై పడింది. మిగిలిన భూములను దుక్కిదున్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకుంటే, ప్రభుత్వ పరంగా పరిహారం కాజేయవచ్చనేది ఆక్రమణదారుల ఎత్తుగడగా ఉంది. ఈ విషయం స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బందికి తెలిసినా మౌనం వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్వాధీనం చేసుకుంటాం

శోత్రియ భూముల్లోకి ప్రవేశించడం అక్రమం. దీనిపై గతంలో సైతం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

- రాజశేఖర్, తహసీల్దారు

తోడేళ్లకు తోడపుట్టినట్లు తవ్వేస్తున్నారు



విచ్చలవిడిగా ఇసుక రవాణా

గాజులమండ్యం సమీపంలోని నదిలో ట్రాక్టర్‌కు ఇసుక నింపుతున్న జేసీబీ



- పాపానాయుడుపేట మార్గంలో కొత్తపాళెం వద్ద డంప్ చేసిన ఇసుక

రేణిగుంట, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాకు రేణిగుంట మండలంలోని స్వర్ణముఖి కేంద్రంగా మారింది. ప్రజాక్షేత్రంలో మాటలను తూటాలుగా పేల్చుకునే పలు పార్టీల నేతలు ఇసుక అక్రమ రవాణాలో చేతులు కలిపారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

మండలంలో తండ్లం నుంచి జీపాళెం వరకు సుమారు 15 కి.మీ.కుపైగా స్వర్ణముఖి నది పారుతోంది. ఈ ప్రాంతం ఇసుకాసురులకు వరంగా మారింది. గనుల శాఖ, పోలీసుల సహకారంతో ఇష్టారాజ్యంగా తరలిస్తున్నట్లు సమాచారం.

కన్నెత్తి చూడని అధికారులు

గాజులమండ్యం పరిధిలోని స్వర్ణముఖి నదిలో ఒక పార్టీ నేత జేసీబీ పెట్టి తవ్వకాలు చేస్తున్నారు. పైగా ఈ నదిలో ఇంత వరకు తమదేనని, ఇలా ఇక్కడ ఉన్న ఇసుకను ఆక్రమించారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఫిర్యాదు చేసినా బుట్టదాఖలు చేస్తున్నారు.

పాపానాయుడుపేట మార్గంలో డంపింగ్

రేణిగుంట నుంచి పాత పాపానాయుడుపేట మార్గం మూతపడింది. దీంతో కొత్తపాళెం వద్ద కొందరు ఇసుకను తరలించి డంప్ చేస్తున్నారు. ఆపై ఇక్కడి నుంచి విక్రయాలు సాగిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

మళ్లీ అడ్డగోలు తవ్వకాలు



పూడి సమీపంలో టిప్పరుకు ఇసుక నింపుతున్న హిటాచీ యంత్రం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: తొట్టంబేడు మండలం పూడి, పెన్నలపాడు సమీపంలోని స్వర్ణముఖినది నుంచి వైకాపా మాజీ మంత్రి, పెద్దాయన అనుచరుడి పేరుతో తవ్వకాలు చేపట్టారు. వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లతో బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. నది మధ్యలోకి బాటలు ఏర్పాటు చేసుకుంటున్నారు. స్థానిక రైతులు తవ్వకాలను అడ్డుకుంటున్నా అక్రమార్కులు ఇసుక తవ్వకం ఆపడం లేదు.

చర్యలు తీసుకుంటాం

కొత్తపాళెం, గాజులమండ్యం గ్రామ రెవెన్యూ అధికారులను అక్కడికి పంపి విచారణ చేయిస్తాం. తగు చర్యలు తీసుకుంటాం.

- సురేష్‌బాబు, తహసీల్దార్, రేణిగుంట



ముక్కంటి ఆలయ భూముల్లో మట్టి తవ్వకాలు చేసినట్లు ఆనవాళ్లు

పొన్నేరిపై.. అక్రమార్కుల గురి

◆ మట్టి తవ్వకాలపై ఫిర్యాదులు ◆ పరిశీలించిన అధికారుల బృందం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరునిపై ఉన్న భక్తిని చాటుకునేందుకు ఎందరో దాతలు వాళ్ల భూములను ఇక్కడి ఆలయాలకు దానంగా ఇచ్చేశారు. అలా ఆలయానికి సంబంధించి వందల ఎకరాల్లో భూములున్నాయి. వీటిల్లో విలువైన భూములన్నీ వివాదాస్పదంగానే ఉండటం గమనార్హం. తమిళనాడు రాష్ట్రం పొన్నేరి తాలుకా వల్లూరు గ్రామ పరిధిలోని 24.25 ఎకరాల విస్తీర్ణంలో స్థలం ఆలయానికి చెందినట్లు రికార్డుల ద్వారా స్పష్టమవుతోంది. ఈ భూమి విస్తీర్ణం దీర్ఘచతురస్రాకారంలో ఉండటంతో పాటు హద్దులుగా ఎప్పుడో ఏళ్ల క్రితమే తాటిచెట్లను నాటారు.

స్థిరాస్తి వ్యాపారుల కన్ను

చుట్టూ ఉన్న భూములకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా స్థిరాస్తి వ్యాపారులు ఇక్కడి భూములపై కన్నేశారు. ఆక్రమించుకోవాలన్న దిశగా ఏళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ భూముల గుండా రోడ్డు ఏర్పాటుకు గతంలో ఇక్కడి అధికారులు అభ్యంతరం చెప్పడంతో శ్రీశైలంలో ఈవోగా పని చేస్తున్న అధికారిని డిప్యుటేషన్ వేయించుకుని మరీ ప్రయత్నాలు చేపట్టడం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్ర సరిహద్దుకు దూరంగా ఉండటంతో అక్రమార్కులు తాటిచెట్లు కొట్టేయడం, భూముల్లో మట్టిని తవ్వేయడం ఎక్కువైంది. గత ఏప్రిల్, మే నెలల్లో ఇష్టానుసారం మట్టిని తవ్వేసినట్లు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఇలా క్రమేణా మట్టి తవ్వకాలతో పాటు హద్దులు చెరిపేసి భూములు కబ్జా చేయాలన్నది అక్కడి స్థిరాస్తి వ్యాపారుల పన్నాగం. అయితే అక్కడున్న గిరిజనులు ఈ భూమిని సంరక్షించడంలో తమవంతుగా శ్రమిస్తుండటం విశేషం.

రూ.కోట్లలో ఆదాయం

ఇక్కడున్న భూమిని ఆనుకుని చుట్టూ పారిశ్రామిక పరంగా ఎంతో పురోభివృద్ధి చెందుతోంది. పదేళ్లుగా ఇక్కడున్న భూముల చుట్టూ పారిశ్రామిక వాడలు అభివృద్ధి చెందాయి. పొన్నేరి మీదగా చెన్నై నౌకాశ్రయానికి వెళ్లే మార్గం కావడంతో ఇక్కడి భూములకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఇక్కడి భూముల విలువ దాదాపు రూ. 30 కోట్లకు పైమాటే.

సంరక్షణకు చర్యలు

పక్క రాష్ట్రం కావడం, అందులోనూ దూరం కావడంతో ఏళ్ల తరబడి ఈ భూముల సంరక్షణ అధికారులకు శిరోభారంగా మారుతోంది. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశంతో తిరుపతి ఆర్జేసీ, ముక్కంటి ఆలయ ఈవోగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ ఆజాద్ అధికారులతో కలసి మంగళవారం భూములను సందర్శించారు. మట్టి తవ్వకాలు జరిగిన ప్రదేశాలను గుర్తించి అక్కడి వాళ్లతో చర్చించారు. మట్టి తవ్వకాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే ఆలయ స్థలం కబ్జాలకు గురికాలేదని నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఇదే విషయమై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు నివేదికలు సిద్ధం చేసి పంపే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

పుర తాగునీటి పథకాలకు ఊపిరి

❖ ఏఐఐబీ పనుల్లో కదలిక
❖ నాలుగేళ్ల గడువు పొడిగింపు



సూళ్లూరుపేట: మంగళంపాడు చెరువులో ఆగిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనులు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పురపాలికల్లో ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించాలని 2018లో ఏషియన్ మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంకు(ఏఐఐబీ) నిధుల ద్వారా చేపట్టిన పనుల్లో కదలిక రానుంది. గత వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆ పనుల పూర్తికి రంగం సిద్ధమైంది. ఇటీవల ఏఐఐబీ బృందం క్షేత్రస్థాయిలో నిలిచిపోయిన పనులను పరిశీలించి వెళ్లింది. నిధులిచ్చేందుకు అంగీకారం తెలుపుతూ మరో నాలుగేళ్ల సమయం ఇచ్చారు.

నిధులు జమ చేయని వైకాపా ప్రభుత్వం

కొవిడ్ వల్ల పనుల్లో జాప్యం అనివార్యమైంది. దాంతో 2023 ఫిబ్రవరిలోగా పనులు చేసేందుకు పొడగింపు ఇచ్చారు. తర్వాత సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి పైపులైన్లు వేసి, ట్యాంకుల నిర్మాణం చేపట్టడంతోపాటు, ఇంటింటా కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు వీధుల్లోనూ పైపులైన్లు వేశారు. పనులు చురుగ్గా జరుగుతున్న సమయంలో ఏఐఐబీ వారు గుత్తేదారునికి తమ వాటా నిధులు ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వాటా ఇవ్వలేదు. దాంతో గుత్తేదారులు పనులు ఎక్కడికక్కడ నిలిపివేశారు.

అప్పుడేం జరిగిందంటే..

నెల్లూరు ప్రజారోగ్యశాఖ సర్కిల్ పరిధిలో చిత్తూరు నగరపాలక సంస్థతోపాటు పుత్తూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, అద్దంకి, గిద్దలూరు, చీమకుర్తి పురపాలక సంఘాల్లో రానున్న 40 ఏళ్ల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత తాగునీటి ఎద్దడి పరిష్కారానికి డిజైన్లు రూపొందించారు. ఇందుకు ఏఐఐబీ రూ.559 కోట్ల నిధుల మంజూరుకు 2018లో ముందుకొచ్చారు. అప్పట్లో అధికారంలో ఉన్న తెదేపా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అర్బన్ వాటర్ సప్లయ్ అండ్ సెప్టేజ్ మేనేజ్‌మెంట్ ఇంప్రూమెంట్ ప్రాజెక్టు ఫేస్-1 కింద రూ.559 కోట్లు(ఒకే ప్యాకేజీ కింద) పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అదే ఏడాది సెప్టెంబరులో సాంకేతిక అనుమతులిచ్చారు. తర్వాత నిర్వహించిన టెండర్లలో ఎన్‌సీసీ సంస్థ పనులు దక్కించుకుంది. ఆ సంస్థ 2019 ఫిబ్రవరిలో 24 నెలల్లో పనులు పూర్తి చేసేలా ఒప్పందం చేసుకున్నారు.

గుత్తేదారులతో సమావేశం

రాష్ట్రంలో ఏఐబీ నిధులతో జరుగుతున్న పనులపై గుత్తేదారులతో మంగళవారం విజయవాడలో ప్రభుత్వ ఆర్థికశాఖ సమావేశం నిర్వహించింది. ఇందులో పలు అంశాలు చర్చకు వచ్చాయి. 2018 ధరలకు, ఇప్పటికీ భారీ వ్యత్యాసం ఉండటంతో ఈ అంశం చర్చకు వచ్చింది. ఇందుకు ఆర్థికశాఖకు చెందిన అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

పథకాల విషయానికి వస్తే..

- తాగునీటి పథకాల ఏర్పాటుకు సూళ్లూరుపేటకు రూ.112.19 కోట్లు, నాయుడుపేటకు రూ. 125.44 కోట్లు కేటాయించారు. ఇందులో ఏఐబీ వాటా రూ.166.34 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.71.29 కోట్లు. ఇప్పటి వరకు పనులు చేసినందుకుగాను ఏఐబీ వారు రూ.56.83 కోట్లు విడుదల చేశారు. రెండు పురపాలికల్లో 35 శాతం పనులు జరిగాయి.
- పుత్తూరు పురపాలక సంఘానికి తాగునీటి కోసం కండలేరు-పూండి కెనాల్ నుంచి 55 కి.మీల పైపులైన్‌గాను 35 కి.మీలు మాత్రమే చేశారు. రాయపేడు, లక్ష్మీపురం వద్ద సంపులు నిర్మించాలి.
- చిత్తూరులో అమృత్ పథకానికి అనుసంధానంగా ఏఐబీ నిధులు ఇచ్చింది. అడవిపల్లి రిజర్వాయర్ నుంచి 8.5 కి.మీలు పైపులైన్‌తోపాటు 16 కేఎల్ వీఎల్ఎస్ఆర్ నిర్మించాలి.

మదినిండా.. కపిరాజు జెండా



గూడూరులో జెండా ఉత్సవాన్ని బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ వీధులన్నీ భక్తులతో కిక్కిరిశాయి. మంగళ వాయిద్యాలు, యువత కేరింతల నడుమ సుమారు 100కు పైగా ఆంజనేయస్వామి జెండాలను పుర వీధుల్లో ఊరేగించారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. **- న్యూస్‌టుడే, గూడూరు పట్టణం**

ఏఈవో ధనపాల్ సస్పెన్షన్



శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న గోశాల ఏఈవో ధనపాల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈవో చంద్రశేఖర్ ఆజాద్ బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. వైకాపా నేతలతో అంటకాగిన అధికారులపై ఈవో చర్యలకు శ్రీకారం చుట్టారు. ఏఈవోగా పని చేసిన ధనపాల్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గోశాలకు బదిలీ చేశారు. తాజాగా గోశాలను సందర్శించిన చంద్రశేఖర్ ఆజాద్ అక్కడున్న సమస్యలను స్వయంగా పరిశీలించారు. గోశాల నిర్వహణ పట్ల అలక్ష్యంగా వ్యవహరించడం, నాలుగు గోపురాల వద్ద ఆలయ ఒప్పంద ఉద్యోగి గంగాధరం సతీమణి పేరుతో దుకాణాల నిర్వహణలో ఏఈవో పాత్ర ఉన్నట్లు ఈవో విచారణలో స్పష్టమైంది. ఈ క్రమంలో ఏఈవో ధనపాల్‌ను సస్పెండ్ చేశారు. దీంతో గతంలో వైకాపాకు అంటకాగిన అధికారుల్లో గుబులు మొదలైంది.



విజేత జట్టుతో ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ

విద్య, క్రీడలు రెండు కళ్లతో సమానం

ఏర్పేడు, న్యూస్‌టుడే: యువతకు విద్య, క్రీడలు రెండు కళ్లతో సమానమని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ తెలిపారు. సమయోగ్ కార్యక్రమంలో భాగంగా ఐదు రోజుల పాటు తిరుపతి ఐఐటీలో పలు కళాశాల విద్యార్థులతో జరిగిన క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలోనే తిరుపతి ఎస్వీసీఈ కళాశాల విద్యార్థులు క్రికెట్‌లో, ఐఐటీ విద్యార్థులు బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్‌లో విజేతలుగా నిలిచారు. అథ్లెటిక్ ఓవరాల్ ఛాంపియన్‌గా ఐఐటీకి చెందిన రూపశ్రీ, పురుషుల విభాగంలో మోహన్‌బాబు యూనివర్సిటీకి చెందిన రాజారెడ్డి విజేతగా నిలిచారు. వీరిని ఐఐటీ డైరెక్టర్ అభినందిస్తూ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల వ్యవహారాల డీన్ ఎన్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

5 నుంచి అంతరిక్ష వారోత్సవ పోటీలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలను శ్రీహరికోట సందర్శనకు తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. 5వ తేదీన ఉదయం పద్మావతి మహిళా వర్సిటీలో జూనియర్స్ (6-9), సీనియర్స్ (10 నుంచి ఇంటర్) విద్యార్థులకు రాత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం డిగ్రీ, పీజీ విద్యార్థులకు వక్తృత్వ, సైన్స్ మోడల్ ఎగ్జిబిషన్ పోటీలు ఉంటాయన్నారు. 7వ తేదీన శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సైన్సు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

5న మహిళా వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంబీఏ మీడియా మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్స్ సంచాలకులు సువర్ణలతాదేవి తెలిపారు. ఏపీ ఐసెట్-24లో అర్హత సాధించి, ఇప్పటివరకు ప్రవేశాలు పొందని విద్యార్థినులు తమ ఒరిజినల్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని తెలిపారు.

63 దుంగలు, నాటుతుపాకీ స్వాధీనం

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: ఏపీ టాస్క్‌ఫోర్స్ బలగాలు కేవీబీపురం మండలం పరిధిలోని అడవుల్లో పెద్దఎత్తున ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నాయి. ఇద్దరు దొంగలను అరెస్ట్‌చేసి నాటుతుపాకీని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో బుధవారం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. పచ్చారుమాను సమీపంలో 63 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని అదేమండలానికి చెందిన ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వన్యప్రాణులను వేటాడేందుకు ఉపయోగించే నాటు తుపాకీని వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

భక్తుల కష్టాలు
మరుగున పడేదెలా?

అలిపిరి బాలాజీ లింకు బస్టాండ్‌లో శ్రీవారి భక్తులకు కనీస వసతులు కొరవడ్డాయి. వాహనాలు నిలిపే ఆవరణలోని పాత మరుగుదొడ్లను మరమ్మతుల కారణంగా మూసివేయడంతో దూరప్రాంత భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. బ్రహ్మోత్సవాలు, పెరటాసి మాసం కావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉంది. తితిదే అధికారులు పర్యవేక్షించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు, మొబైల్ మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావాలని, దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చూడాలని విన్నవిస్తున్నారు. **- ఈనాడు, తిరుపతి**



పేరుకుపోతున్న వ్యర్థాలు



నిర్మాణంలో ఉన్న నూతన మరుగుదొడ్లు..



భక్తుల అవస్థలు..



మరమ్మతుల కోసం మూసివేత

404 బస్సులు.. 1,930 ట్రిప్పులు

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అందించాల్సిన సేవలపై ఆర్టీసీ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రత్యేక అధికారులు, సిబ్బందిని నియమించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా వారిని గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చేలా చర్యలు చేపట్టారు. సాధారణ రోజుల్లో తిరుపతి- తిరుమల మధ్య 340 సప్తగిరి బస్సులు, 64 విద్యుత్తు ఏసీ బస్సులు ప్రతిరోజూ 1,450 ట్రిప్పులతో 75,000 మంది ప్రయాణికులను చేరవేస్తున్నారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో రోజుకు 404 బస్సులు 1,930 ట్రిప్పులతో 1.70 లక్షల మంది భక్తులను, గరుడసేవ రోజు 2,714 ట్రిప్పులతో 2.50 లక్షల మంది భక్తులకు సేవలందించేలా ప్రణాళిక రూపొందించారు. పెరటాసి మాసం, దసరా సెలవులను దృష్టిలో ఉంచుకొని తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను తిరుపతి బస్టాండ్ వరకు చేరవేసేందుకు టీఎన్‌ఆర్టీసీ నుంచి 150, ఏపీఎస్‌ఆర్టీసీ నుంచి 150 బస్సులు నడిపేలా ఒప్పందం చేసుకున్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ ప్రణాళిక



◆ బస్సుల నిర్వహణలో లోపాలు లేకుండా నిరంతరాయంగా తిరిగేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఐదు దశల్లో ఘాట్ రోడ్డు బస్సులను తనిఖీ చేశాకనే అనుమతించనున్నారు. ఇతర జిల్లాల ఉన్నత స్థాయి అధికారులు 32 మంది, డ్రైవర్లు 200, కండక్టర్లు 180, సిబ్బంది 115 మంది సేవలను వినియోగించనున్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

తితిదే, పోలీసు శాఖల సమన్వయంతో బస్సులను నడిపేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పని చేసేలా ఆదేశాలు ఇచ్చాం. విశ్రాంత ఉద్యోగుల సేవలు వినియోగించుకుంటాం.
– తిమ్మాడి చెంగల్ రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు బుధవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని తెదేపా మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్, సినీ సంగీత దర్శకుడు తమన్, తితిదే మాజీ ఛైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి దర్శించుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ శ్రీవారి సేవలో పాల్గొన్నారు.





శ్రీవారి ఆలయం ఎదుట డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమార్తెలు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, కళాదర్శకుడు ఆనందసాయి తదితరులు ◆ సంగీత దర్శకుడు తమన్

స్వచ్ఛతలో ప్రజల భాగస్వామ్యం అవసరం



స్వచ్ఛతాహీ సేవ సమావేశంలో ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: స్వభావ్ స్వచ్ఛత- సంస్కార్ స్వచ్ఛతలో ప్రజల భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం కచ్చపి ఆడిటోరియంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ నరసింహయాదవ్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ గతనెల 17 నుంచి ఇప్పటివరకు 2,015 టన్నుల చెత్తను తరలించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా టాటా క్యాన్సర్ ఆసుపత్రి వైద్యుల బృందం కార్మికులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ర్యాలీలు, పరుగుపందెం విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. డీసీ అమరయ్య, ఏసీ చరణ్‌తేజరెడ్డి, జిల్లా వైద్యాధికారి డా.శ్రీహరి, నగరపాలిక వైద్యాధికారి డా.అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మస్కట్ వెళ్లిన తల్లి జాడలేదు'



మాట్లాడుతున్న ఇంద్రాణి కుటుంబ సభ్యులు

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: బతుకుదెరువు నిమిత్తం మస్కట్ దేశానికి వెళ్లిన తన తల్లి ఇంద్రాణి ఏజెంట్ చేతిలో మోసపోయి ఆ దేశంలోనే ఇబ్బందులు పడుతోందని రేణిగుంట మండలం తారకరామా నగర్‌కు చెందిన జాన్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఇంద్రాణి చెల్లెలు సుధారాణితో కలిసి మాట్లాడారు. ఏడు నెలల కిందట తమిళనాడుకు చెందిన ఏజెంట్‌ను నమ్మి రెండోసారి మస్కట్‌కు వెళ్లిందని, అక్కడ ఏమి జరిగిందో తెలియదని, ప్రమాదంలో ఉన్నానని వీడియో పంపి ఇప్పటికి రెండు వారాలవుతున్నా అందుబాటులోకి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్ స్పందించి స్వదేశానికి రప్పించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేశామన్నారు.

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

తిరుపతి (నేరవిభాగం) వారాహి సభ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు డీఎస్పీ వెంకట నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు బాలాజీ కాలనీ కూడలి వైపు వాహనదారులకు అనుమతి లేదన్నారు. ఎస్వీయూ పీఎస్ కూడలి, వెస్ట్ చర్చి, టౌన్‌క్లబ్ కూడలి, ఆఫీసర్స్ క్లబ్ నుంచి వాహనాల రాకపోకలు ఉండవని, చెర్లోపల్లి నుంచి తిరుపతికి వచ్చే వాహనాలు జూపార్కు మీదుగా రావాలన్నారు. చిత్తూరు నుంచి తనపల్లి క్రాస్ నుంచి బస్టాండుకు రావాలన్నారు.

'పురందేశ్వరి భాజపానా.. తెదేపానా..?'

నగరి, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు తీర్పుపై భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే, బావగారి కళ్లలో ఆనందం కోసం మాట్లాడినట్లు అనిపిస్తోందని వైకాపా అధికార ప్రతినిధి ఆర్.కె.రోజా అన్నారు. ఆమె బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పురందేశ్వరి మాటలు చూస్తుంటే ఆమె భాజపా అధ్యక్షురాలా.., లేక తెదేపా నాయకురాలా? అనే సందేహం కలుగుతోందని ఎద్దేవా చేశారు. పవిత్ర తిరుమల లడ్డూ ప్రతిష్ఠ దిగజార్చేలా బహిరంగ ప్రకటనలు ఎలా చేస్తారని కోర్టు ప్రశ్నించిందని, పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడిన చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఎందుకు కోర్టులో మాట్లాడలేదని ప్రశ్నించారు.

'రోజా వ్యాఖ్యలు తగవు'

తిరుపతి (గాంధీరోడ్డు) : భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపై మాజీమంత్రి రోజా చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన గత వైకాపా ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతగా బయటపెట్టడం తప్పా అని ప్రశ్నించారు. న్యాయస్థానంలో న్యాయమూర్తులు అడిగే ప్రశ్నల గురించి ఏ1 జగన్, ఏ2 విజయసాయిరెడ్డిని అడిగి తెలుసుకోవాలని హితవు పలికారు. వెంటనే రోజా, విజయసాయి రెడ్డిలు పురందేశ్వరికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆడుతూ అదృశ్యమై.. అందనంత దూరమై

విషాదాంతమైన పుంగనూరు బాలిక అస్పియా అంజుమ్ కేసు ◆ మిస్టరీ ఛేదనకు పోలీసుల దర్యాప్తు



అంజుమ్ మృతదేహాన్ని చూసేందుకు తరలి వచ్చిన ప్రజలు



అస్పియా అంజుమ్ (పాత చిత్రం)

చిన్నారి చిరునవ్వులు వికసించవా అని ఆశ
పొన్నారి చిలుకపలుకులు వినిపించవా అని శ్వాస
చిట్టి పాదాలు సందడి చేయవా అని ధ్యాస
వెలుగైన కను'పాప' కనిపించదా అని తపన
అడుగడుగునా అన్వేషణ అగుపిస్తావని ఊరంగా నిరీక్షణ
ఆడుతూ అదృశ్యమై.. అంతలోనే అందనంత దూరమై ఆరిపోయింది చిన్నారి దీపం
ఎదురుచూసిన కళ్లు.. వాకిళ్లు ఉబికాయి కన్నీటి సెలయేళ్లు
అయ్యో చిట్టితల్లి.. ఎంత ఏడ్చిందో కన్నతల్లి
నీ జలసమాధి గుండె పొగిలె మాది

పుంగనూరు (గ్రామీణ, న్యూస్‌టుడే): బాలిక అస్పియా అంజుమ్(7) కథ దుఃఖాంతమైంది. పుంగనూరులో ఆదివారం అదృశ్యమైన బాలిక పట్టణ సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో బుధవారం శవమై తేలింది. చిన్నారి మరణవార్త తెలుసుకున్న పట్టణ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

అదే రోజు ఫిర్యాదు

ఆదివారం రాత్రి బాలిక అదృశ్యం కాగా స్థానిక యువత, బంధువులు వెతికారు. ఆచూకీ కనిపించకపోవడంతో తల్లిదండ్రులు అజ్మతుల్లా, షమియా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం డాగ్ స్క్వాడ్ బృందాలు ఉబేదుల్లా కాంపౌండ్, చెంగ్లాపురం రోడ్డు పరిసర ప్రాంతాల్లో సంచరించాయి. ఎస్పీ మణికంఠ రెండు రోజులు అక్కడే ఉండి దర్యాప్తు పర్యవేక్షించారు. డీఐజీ షేముషి బాజ్‌పాయి మంగళవారం పుంగనూరు చేరుకుని బాధితులతో మాట్లాడారు.

చివరకు ఎస్ఎస్ ట్యాంకులో తేలిన మృతదేహం

పోలీసులను ముప్పుతిప్పలు పెట్టిన చిన్నారి కిడ్నాప్ చివరకు హత్యగా తేలింది. డీఎస్పీలు సాయి కుమార్, ప్రభాకర్, సీఐలు, ఎస్సైలు బుధవారం వేకువజామున పట్టణ శివారులోని నక్కబండ, గూడూరుపల్లె సమీపం, చెంగ్లాపురం లో అనుమానిత ఇళ్లలో జల్లెడ పట్టారు. అయినా ఎటువంటి ఆధారాలు లభించలేదు. బుధవారం ఎస్ఎస్‌ట్యాంకులో మృతదేహం తేలడంతో పోలీసులు గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లుగా అనుమానిస్తున్నారు. చిన్నారి మృతదేహాన్ని జేసీ విద్యాధరి, ఎస్పీ మణికంఠ పరిశీలించారు. ఎన్ఎస్ పేటలో ఈద్గా వద్ద అస్పియా అంజుమ్ ఆత్మశాంతికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం



విలపిస్తున్న అంజుమ్ తండ్రి అజ్మతుల్లా

సీసీ కెమెరాలు పరిశీలించినా.. ప్చ్

పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండ్‌లో బాలిక అదృశ్యమైంది. అక్కడ నుంచి పట్టణంలోని బస్టాండ్ లేదా ఎంబీటీ రోడ్డు, ఎన్టీఆర్ కూడలి, అంబేడ్కర్ కూడలి బైపాస్‌రోడ్డు, ఎన్ఎస్ పేట దారిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వరకు బాలికను తీసుకెళ్లారు. ఆ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించినా ఎలాంటి ఆధారాలు దొరకలేదని సమాచారం.

పరీక్షల నిమిత్తం తిరుపతికి

బాలిక ఇంటి నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మూడు కి.మీ. ఉంది. సమ్మర్ స్టోరేజ్‌లో లభ్యమైన మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి కొన్ని అవయవాలను పరీక్షల నిమిత్తం తిరుపతి పరిశోధనశాలకు పంపారు. రిపోర్టు ఆధారంగా తదుపరి చర్యలు చేపడుతామని ఎస్పీ మణికంఠ పేర్కొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	113
రిటైల్	135
లేయర్	110
బ్రాయిలర్స్	196
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	223
లేయర్ మాంసం	187

తిరుపతి

•తిరుపతి •చంద్రగిరి

సామాజిక బాధ్యతగా మొక్కల పెంపకం

తిరుచానూరు: మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం తిరుచానూరు-చైతన్యపురం రహదారి మార్గంలో పేదరపోయిన వృక్షాలను స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా తొలగించారు. అనంతరం రహదారి పొడవునా 400 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీపీవో సుశీలాదేవి, పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌రాజు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు సారె సమర్పణ

రామచంద్రాపురం: రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తి పీఠం ఆవరణలో వెలసిన శ్రీముత్యాలమ్మ అమ్మవారికి బుధవారం గ్రామస్థులు సారె సమర్పించారు. అర్చకులు అమ్మవారికి 108 కళశాలతో అభిషేకం నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టారు.

కల్యాణ వేంకన్న సన్నిధిలో ఏర్పాట్లు

తిరుపతి (గ్రామీణ): తుమ్మలగుంటలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. విద్యుత్తు వెలుగులతో గ్రామంలో బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

తాగునీ పైపులైన్‌కు మరమ్మతులు

స్పందనకు వందనం

చంద్రగిరి: నరసింగాపురం పంచాయతీ రాజీవ్‌వీధిలో బోరుబావి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. తాగునీటి వృథాపై 'ఈనాడు'లో 'మీకు తోడూ' శీర్షిక ప్రచురితం కాగా సర్పంచి చెంచురత్నంశెట్టి స్పందించారు. కొత్తవి అమర్చి వృథా కాకుండా చర్యలు చేపట్టారు.

తెలుగు గంగ వృథాకు అడ్డుకట్ట

జీవకోన(తిరుపతి): తెలుగుగంగ నీటి వృథాపై అధికారులు స్పందించారు. అక్కారంపల్లె సమీపంలోని కరకంబాడి మార్గంలో తెలుగుగంగ నీటి వృథాపై కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక సంస్థ అధికారులు మరమ్మతులు చేయించి లీకేజీని అరికట్టారు.

'మద్యం దుకాణాల పెంపు దారుణం'

తిరుపతి (నగరం): తిరుపతిలో ఎక్కువ మద్యం దుకాణాలు కేటాయించడం దారుణమని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయంతి, డా.సాయిలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో కళ్లకుగంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. జయచంద్ర, హేమలత, కోమలమ్మ, సాయిదీప్తి, లత, బుజ్జమ్మ, రాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ సన్నిధిలో భక్తులు

మహాలయ పక్షంలో పోటెత్తిన భక్తులు

శ్రీకపిలేశ్వర స్వామి ఆలయ సన్నిధి బుధవారం మహాలయ అమావాస్య సందర్భంగా తర్పణాలు వదిలే జనాలతో కిక్కిరిసింది. స్థానికంగా బందోబస్తు లేకపోవడంతో మెయిన్‌గేటు వద్ద వాహనాల రాకపోకల సమయంలో స్వల్ప తోపులాట జరిగింది. చిన్నారులతో వచ్చిన భక్తులు ఇబ్బందులుపడ్డారు. ఎండతీవ్రతకు గొడుగుల నీడన పూజలు చేస్తూ కనిపించారు. అలిపిరి వైపు ట్రాఫిక్ స్తంభించింది. **- ఈనాడు, తిరుపతి**

కాలువలు కుదించి..

ముంపు సమస్యలు విస్మరించి

భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవంటున్న స్థానికులు



ఎయిర్ బైపాస్ రోడ్డులోని పాత మురుగు కాలువ



కుదించి కొత్తగా చేపట్టిన నిర్మాణం

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు లోటుపాట్లమయంగా మారాయి. ఉన్న కాలువలను సైతం కుదించి నిర్మాణాలు చేపట్టడంపై విస్మయం వ్యక్తమవుతోంది. నగరంలోని ఎయిర్ బైపాస్ రోడ్డులో ఏడాదిగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. గతంలో రోడ్డుకు ఇరువైపులా సుమారు ఎనిమిది అడుగుల వెడల్పుతో కాలువలు ఉండేవి. మహిళా వర్సిటీ నుంచి ముత్యాలరెడ్డిపల్లిలోని పలు ప్రాంతాల్లోని మురుగునీరు వాటిలో ప్రవహించి ఎయిర్ బైపాస్‌రోడ్డు మీదుగా వెళ్లేది. అభివృద్ధిలో భాగంగా ఏడాది కిందట ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. గతంలో ఎనిమిది అడుగుల వరకు ఉన్న కాలువను కాస్త నాలుగడుగులకు కుదించేశారు. రెండువైపులా ఫుట్‌పాత్ కాంక్రీట్ గోడ నిర్మించి దానిపై సిమెంట్ బండలు వేస్తున్నారు. ముత్యాలరెడ్డిపల్లెలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఉద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎక్కువగా ఈ ప్రాంతంలో నివసిస్తున్నారు. బయటి ప్రాంతాల ప్రజలు సైతం ఇక్కడ బాడుగకు ఇళ్లు తీసుకుని ఉంటున్నారు. నీటి వినియోగం ఎక్కువగా ఉంటోంది. ఉన్న వాటిని పెద్దవి చేయకపోయినా, యథావిధిగా నిర్మించాల్సి ఉండగా ఇంజినీరింగ్ అధికారులు రోడ్డును విస్తరించే క్రమంలో సగానికి కుదించేశారు. భారీ వర్షాలు వస్తే మురుగు రోడ్డుపైకి పొంగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక అధికారులు స్పందించి అన్నమయ్య కూడలి దిగువనున్న కాలువనైనా విస్తరించి నిర్మించాలని కోరుతున్నారు. లేని పక్షంలో మురుగు పొంగి పల్లపు ప్రాంతంలోని ఇళ్లలోకి చేరే ప్రమాదం ఉంది.



గాంధీజీ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ వెంకట్రావు



అన్నదానం చేస్తున్న కస్తూర్బాగాంధీ కేంద్ర ట్రస్ట్ ఛైర్మన్ పి.సి.రాయలు



ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఆధ్వర్యంలో..

మహాత్ముడి ఆశయాలు కొనసాగిద్దాం

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమన్న మహాత్మా గాంధీ ఆశయాల దిశగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. మహాత్మాగాంధీ జయంతి వేడుకలు డీపీవోలో ఘనంగా నిర్వహించారు. స్విమ్స్‌లో సంచాలకులు డా. ఆర్వీ కుమార్ నివాళి అర్పించారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఉపకులపతి కృష్ణమూర్తి పాల్గొన్నారు. తిరుపతి (నగరపాలిక): నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య గాంధీజీ నివాళులు అర్పించారు. శ్రీవేంకటేశ్వర పశువైద్య కళాశాలలో ఇన్‌ఛార్జి అసోసియేట్ డీన్ డా.జి.ఆర్.కె.శర్మ, శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డా.ఎం.వి.రమణ జాతిపిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **తిరుపతి (బైరాగిపట్టెడ) :** ఎస్వీయూ ఆవరణలోని గ్రంథాలయం వద్ద ఉన్న విగ్రహానికి రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, గ్రంథాలయ విభాగాధిపతి సురేంద్రబాబు, ప్రిన్సిపాళ్లు ఆచార్య తులసీరామకృష్ణారెడ్డి, పద్మనాభం, నరసయ్య, ఓవీఎస్ రెడ్డి, ఇంజినీరు తాండవకృష్ణ నివాళి అర్పించారు. తితిదే జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో దేవస్థానం పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో పుష్పాంజలి ఘటించారు.



మహిళా వర్సిటీలో పాల్గొన్న ఇన్‌ఛార్జి వీసీ ఉమ, డీన్లు సుజాత, వాణి, అధ్యాపకులు

భక్తులతో మమేకమవుతూ..!

తిరుమల, న్యూస్‌టుడే: కల్తీ నెయ్యి వివాదం నేపథ్యంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష విరమణ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనతోపాటు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన కుమారులు మదన్, జగన్, జనసేన నాయకుడు హరిప్రసాద్ దర్శించుకున్నారు. తన ఇద్దరు కుమార్తెలతో పవన్‌కల్యాణ్ శ్రీవారి ఆలయం నుంచి బయట వచ్చాక అక్కడ వేచిఉన్న అభిమానులను నమస్కరిస్తూ మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ భక్తులతో కలిసి శ్రీవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సిబ్బందిని ఆప్యాయంగా పలకరించారు. తిరుమలలోని గాయత్రి నిలయంలో బసచేసిన పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు భారీగా జనసేన నాయకులు, అభిమానులు తరలివచ్చారు. మూడంచెల భద్రత నడుమ అతిథిగృహంలోకి నాయకులను మాత్రమే అనుమతించారు. కొందరు అభిమానులు కలిసి శ్రీవారి జ్ఞాపికలను అందజేశారు.



అన్నప్రసాద కేంద్రంలో శ్రీవారి సేవకులు, భక్తులకు నమస్కరిస్తున్న పవన్‌కల్యాణ్

మేఘన దంత వైద్యశాల వార్షికోత్సవం

తిరుపతి (వైద్యవిభాగం): స్థానిక అశోకనగర్‌లోని మేఘన మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. హాస్పిటల్ అధినేత డా.ఎం.హేమాద్రి ఓపీలు ఉచితంగా చూసి మందులు పంపిణీ చేశారు. రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్, ఫిల్లింగ్, డెంటల్ ఇంప్లాంట్స్ తదితర దంతవైద్య చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈహెచ్ఎస్, ఆర్టీసీ, యూనివర్సిటీ ఉద్యోగులకు ఉచిత దంత వైద్యసేవలు అందిస్తామని వెల్లడించారు.



చికిత్స చేస్తున్న ఎం.హేమాద్రి



జలమయమైన గాంధీ విగ్రహ కూడలి

పీజీ వైద్య విద్యార్థులకు క్రికెట్ పోటీలు

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: శ్రీవెంకటేశ్వర మెడికల్ కళాశాలలో పీజీ వైద్య విద్యార్థులకు, పీజీ డెంటల్ విద్యార్థులకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడల నిర్వాహకులు డా.తులసీరామ్ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. డా.ఎన్టీఆర్ వైద్యవిశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల మేరకు వాటిని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 క్రీడా జట్లు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. ఎస్వీ వైద్య కళాశాల క్రీడా మైదానం, ఎస్వీ వెటర్నరీ క్రీడా మైదానం, ఎస్వీ అగ్రి కల్చరల్ కళాశాల మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రికెట్ జట్టు కెప్టెన్ వినీత్, మెడికల్ కళాశాల పీఆర్వో వీరకిరణ్ పాల్గొన్నారు.

నగరంలో కుండపోత

తిరుపతి (నగరపాలిక) : నగరాన్ని బుధవారం రాత్రి కుండపోత వర్షం ముంచెత్తింది. పగటివేళ అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమైంది. రాత్రి 9 గంటల సమయంలో గాలులు, ఉరుములు, మెరుపులతో ప్రారంభమైన వర్షం గంటపాటు ఏకధాటిగా కురిసింది. బస్టాండ్, రైల్వేస్టేషన్, తిరుమల బైపాస్ రోడ్డు, శ్రీనివాసం యాత్రికుల వసతి సముదాయం, నంది, లీలామహల్, లక్ష్మీపురం కూడళ్లు తటాకాలను తలపించాయి.

సమస్యల పరిష్కార వేదికలుగా గ్రామసభలు

రామచంద్రాపురం: గ్రామాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గ్రామసభలు చక్కని వేదికలుగా దోహదపడతాయని జాతీయ మానిటరింగ్ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని గంగిరెడ్డిపల్లి, అనుప్పల్లి, నెత్తకుప్పం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మోహన్‌వేలు, ఏపీడీ పద్మలత, ఎంపీడీవో శ్రీనివాశులు, ఈవోపీఆర్డీ దేవిక, ఏపీవో హంసవేణి, ఏపీఎం గురుమూర్తి పాల్గొన్నారు. **చంద్రగిరి గ్రామీణ:** పంచాయతీ అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటే అది ఒక్క గ్రామసభలతోనే సాధ్యమవుతుందని పంచాయతీ కార్యదర్శి శిరీష అన్నారు. 2025- 2026 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పనులను బుధవారం గుర్తించారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏపీవో జ్యోతి, వీఆర్వో హేమంత్, గ్రామ తెదేపా నాయకులు జ్ఞాన శేఖర్, వేణు, రమణ, దేవీలాల్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన



నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: దేశం కోసం మహాత్మాగాంధీ కన్న కలలు నిజం కావాలని, వాటిని సాధించడానికి కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ పరితపిస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు, నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు అన్నారు. బస్టాండ్ సమీపంలోని విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం భాజపా ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.

అకడమిక్ కౌన్సిల్ సభ్యుడిగా నియామకం



డా.జగపతి రామయ్య

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతిలోని పశువైద్య వర్సిటీ పరిధిలోని పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్‌గా పనిచేస్తున్న డా.జగపతి రామయ్య తమిళనాడు పశువైద్య వర్సిటీ అకడమిక్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. తమిళనాడు పశువైద్య వర్సిటీ అకడమిక్ కౌన్సిల్ సభ్యత్వానికి ప్రాధాన్యం ఉంది. పశువైద్య విద్య బోధన, పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాల్లో తనవంతు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు డా.జగపతి రామయ్య తెలిపారు. జాతీయ, రాష్ట్రస్థాయి సలహా సంఘాలు, న్యాక్ కమిటీ సభ్యులుగా, ఐకార్ నోడల్ అధికారిగా పలు హోదాల్లో ఆయన పనిచేశారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

తిరుపతి(మంగళం): వన్యప్రాణులను వేటాడకుండా సంరక్షించుకోవాలని తిరుపతి ఎస్వీ జూపార్కు క్యూరేటర్ సెల్వం సూచించారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో బుధవారం వన్యప్రాణి వారోత్సవాలను ప్రారంభించారు. మనిషి మనుగడ సవ్యంగా ఉండాలంటే చుట్టూ ఉన్న ప్రకృతిని సంరక్షించుకోవాలని, అడవులను అందులోని వన్యప్రాణులను పరిరక్షించుకోవాలని సూచించారు. ఈనెల 8 వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, గ్రీన్ ట్రైబ్ పేరుతో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను నిర్వహించారు.



వన్యప్రాణుల వేషధారణలో విద్యార్థులు

భక్తురాలికి ఆభరణాల సంచి అప్పగింత

తిరుమల, న్యూస్‌టుడే: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో సంచి మరిచిపోయిన భక్తురాలికి అన్నదాన సిబ్బంది బుధవారం తిరిగి అప్పగించారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్.లక్ష్మీ ప్రసన్న కుటుంబ సభ్యులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించి బ్యాగును అక్కడే మరిచిపోయారు. కార్మికుడు జి.నాగరాజు దానిని గుర్తించి ఉన్నతాధికారులకు అప్పగించారు. అందులో రూ.4 లక్షల విలువైన వజ్రాభరణాలు, రూ.1120 నగదు, ఏటీఎం, ఆధార్ కార్డు ఉన్నాయి. అన్నదానం ఏఈవో డి.శివశంకరయ్య, అన్నదానం అధ్యక్షులు పి.వెంకటరమణ, పూజారి రత్నప్రభాకర్, విజిలెన్స్ ఎం.శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భక్తురాలికి సంచిని అప్పగిస్తున్న ఏఈవో డి.శివశంకరయ్య, ఉద్యోగులు

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు



ఉత్సవమూర్తులను ఊరేగింపునకు తీసుకువస్తున్న శ్రీపాద కూలీలు

ఘనంగా అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమావాస్య ఉత్సవాన్ని ఆద్యంతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు విశేష అలంకరణలు చేపట్టారు. మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య చతుర్మాడ వీధుల్లో ఉత్సవర్ల ఊరేగింపు ఘనంగా సాగింది. ఆలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం, తనిఖీ అధికారి హరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

ఏర్పేడు : ఏర్పేడు పంచాయతీలో వైకాపా పాలనలో జరిగిన వరవకాలువ ఆక్రమణలను తొలగించాలని స్థానికులు అధికారులకు విన్నవించుకున్నారు. పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగిన గ్రామసభకు హాజరైన ప్రజలు వరవ ఆక్రమణలపై భగ్గుమన్నారు. రానున్న వర్షాకాలంలో చెరువు నిండితే కలుజునీరంతా ఏర్పేడు మీదకు ప్రవహిస్తోందని వాపోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆక్రమణలు తొలగించేలా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీలోని ఐదు శ్మశాన వాటికలను అభివృద్ధి చేయడంతో పాటు అన్ని వీధుల్లో సిమెంట్ రోడ్లు వేయాలని గ్రామ సభలో తీర్మానించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీమతి, తిరుమలయ్య, కృష్ణయ్య, గురవమ్మ, నిరంజన్, అరుణ పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి: గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అభివృద్ధే లక్ష్యంగా అడుగులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. గాంధీ మహాత్ముని జయంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన మహాత్ముని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని వైకాపా హయాంలో తొలగించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆఘమేఘాలపై మండపాన్ని నిర్మించి విగ్రహాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు. ● పేదలతో పాటు అన్ని వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రధాన లక్ష్యంగా చేసుకున్నట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం బుధవారం పట్టణంలోని గాంధీవీధిలో తెదేపాతో పాటు ఎంజీఎం ఆస్పత్రులు సంయుక్త పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ● **శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే:** ఏర్పేడు మండలంలోని గుడిమల్లం ఆలయంలో నిర్వహించనున్న దేవీనవరాత్రుల ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆలయ ఛైర్మన్ గిరిబాబునాయుడు, పద్మనాభంనాయుడు, రాజశేఖర్ నాయుడు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పట్టణంలోని అంకాళమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు బుధవారం ఆలయం వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులతో పాటు అన్నదానం వితరణకు ముందుకొచ్చిన భక్తులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛత్’ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ కలలుగన్న స్వచ్ఛభారత్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పచ్చదనం, పరిశుభ్రత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి కంకణబద్ధులు కావాలని స్వచ్ఛత్ రూరల్, అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు మావడూరు మోహన్ పిలుపునిచ్చారు. కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్రం చిత్తూరు సౌజన్యంతో ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వచ్ఛత్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం గాంధీజయంతిని పురస్కరించుకుని వరదయ్యపాళెంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచి జ్యోతి అధ్యక్షతన గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. స్థానిక బస్టాండు వద్ద స్వచ్ఛభారత్‌పై ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి, తెదేపా నాయకులు మునిభూషణమ్మ, వెంకయ్య, జనసేన నాయకులు తడ శ్రీను, విజయ్‌కుమార్, జానకీరామ్‌యాదవ్, దొడ్డిశేఖర్, చేనేత సంఘ నాయకులు గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: కులాంతర వివాహం చేసుకున్న మహిళను వరకట్నం తేవాలని వేధిస్తున్నారని బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురానికి చెందిన పూజిత బీఎన్‌కండ్రిగ మండలం కాంపాళెంనకు చెందిన చందు ప్రేమించి మూడేళ్ల కిందట కులాంతర వివాహం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గత మూడు నెలలుగా భర్త చందు, అత్త జయలక్ష్మి తనను వరకట్నం కోసం వేధిస్తుండటంతో పెద్దలను ఆశ్రయించగా న్యాయం జరగకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు పూజిత తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జున్ తెలిపారు.



శ్రీకాళహస్తి: మహాత్మాగాంధీకి నివాళులు అర్పిస్తున్న యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు



శ్రీకాళహస్తి: ఫ్రెండ్స్ అసోసియేషన్ నేతృత్వంలో అన్నదానం



శ్రీకాళహస్తి గ్రామీణం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుభ్రం చేస్తున్న అధికారులు



రేణిగుంట: గాంధీ దంపతుల విగ్రహాలకు నివాళులు అర్పిస్తున్న రైల్వే పింఛన్‌దారులు

మహాత్ముని అడుగుజాడల్లో నడుద్దాం

న్యూస్‌టుడే బృందం: మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలంతా స్వచ్ఛ సంకల్పంతో ముందుకు సాగాలని పలువురు హితవు పలికారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని వివిధ గ్రామాల్లో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. కొన్నిచోట్ల విగ్రహాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. మరికొన్నిచోట్ల స్వచ్ఛభారత్ నిర్వహించారు. మరికొన్నిచోట్ల అన్నదానం చేశారు.



నాగలాపురం: 1993 బ్యాచ్ విద్యార్థుల నివాళి



నారాయణవనం: మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులు



తొట్టంబేడు: గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది



బీఎన్‌కండ్రిగ: గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీడీవో త్రివిక్రమరావు



సత్యవేడులో...



తొట్టంబేడు: మొక్కనాటి నీరు పోస్తున్న పీపుల్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినులు.. రేణిగుంట, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పోటీలకు రేణిగుంట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధిని తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు రెజ్లింగ్‌లో జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో 6గురు, అండర్-19 విభాగంలో ముగ్గురు విద్యార్థులు ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు విజయవాడ సమీపంలోని నున్నా జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు రేఖారాణిని ప్రత్యేకంగా అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం .. నాగలాపురం: నాగలాపురం పంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను సర్పంచి చిన్నదురైసుధ ఘనంగా సన్మానించారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు అనిర్వచనీయమని పేర్కొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం.. రేణిగుంట: వ్యాయామంతోనే పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తపస్య పాఠశాల కరస్పాండెంట్ విక్రం సాలి తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం రేణిగుంట విమానాశ్రయ మార్గంలో 2కె రన్ నిర్వహించారు. గెలుపొందిన మొదటి ముగ్గురు విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

చెత్తనుంచి సంపద కేంద్రం ప్రారంభం.. నారాయణవనం: నారాయణవనం మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. బుధవారం ఈ సందర్భంగాపంచాయతీ కార్మికులను సన్మానించి దుస్తులను పంపిణీ చేశారు. భాస్కరన్, ఈవో షణ్ముగం పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం.. నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని వేలూరు, పిచ్చాటూరుల్లోని వృద్ధాశ్రమాల్లో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేలూరులోని వృద్ధులకు తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు సతీష్‌నాయుడు పండ్లను వితరణగా అందించారు. పిచ్చాటూరు ఆశ్రమంలో గాంధీకి నివాళులర్పించి వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు విశదీకరించారు. అనంతరం వారికి పండ్లు, మిఠాయిలను అందించారు. ఆశ్రమ నిర్వాహకులు త్యాగరాజు, యోగా నిపుణులు మీన, వైద్య సిబ్బంది అశ్విని తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ .. సత్యవేడు: ముదిరాజ్ సేవా సంఘం మండలాధ్యక్షులు మురళి జన్మదిన సందర్భముగా బుధవారం స్థానిక సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డా. మానస తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

స్పందనకు వందనం

బీఎన్‌కండ్రిగ : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ బుధవారం తొలగించారు. ఈ నెల 1వ తేదీన ‘మేమున్నాం మీకుతోడుగా’ శీర్షికన ‘ఈనాడు’లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.



ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు

విశాఖ ఉక్కుపై స్పందనేది

శ్రీకాళహస్తి : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని కూటమి ప్రభుత్వం హామీలు గుప్పించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజులు పూర్తయినా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ విషయమై బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద ప్రదర్శన చేపట్టారు. ఇకనైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్య, శ్రీరాములు, గోపి, శివకుమార్, రవి, మునెమ్మ పాల్గొన్నారు.



గుంతలను మట్టితో పూడుస్తున్న జనసేన నాయకులు

జనసేన చొరవ.. గుంతల పూడ్చివేత

వరదయ్యపాళెం : స్థానిక పంచాయతీ గోవర్ధనపురం వద్ద మారేడుకాలువ వంతెనపై ప్రమాదకరంగా మారిన గుంతలను జనసేన పార్టీ నాయకుల చొరవతో పూడ్చి వేశారు. వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురం వద్ద గల మారేడుకాలువపై వంతెన అడుగడుగునా గుంతలమయమై రాకపోకలకు అవస్థలు పడటమే కాకుండా ప్రమాదకరంగా మారింది. ఇటీవల పోలీసులు, లోకాఫౌండేషన్ ట్రస్టు నిర్వాహకులు పలుమార్లు మట్టితో చదును చేస్తూనే ఉన్నా, వర్షాలకు యధాతథ స్థితికి చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం జనసేన పార్టీ నాయకులు జానకీరామ్ యాదవ్ ఆధ్వర్యంలో వంతెనపై గుంతలను మట్టితో చదును చేయడంతో తాత్కాలిక ఉపశమనం కల్గింది. సర్పంచి జ్యోతి, పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి, జనసేన పార్టీ నాయకులు పసుపులేటి విజయ్‌కుమార్, దొడ్డిశేఖర్, తడ శ్రీనివాసులు, శ్రీధర్, సాగర్, భాజపా నాయకులు గుత్తి త్యాగరాజు పాల్గొన్నారు.

గూడూరు

●గూడూరు ● వెంకటగిరి ● సూళ్లూరుపేట

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	123
లేయర్	110
బ్రాయిలర్స్	222
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	248
లేయర్ మాంసం	187

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పట్టణంలోని అంకాళమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు బుధవారం ఆలయం వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులతో పాటు అన్నదానం వితరణకు ముందుకొచ్చిన భక్తులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభలు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: 17 పంచాయతీల్లో గురువారం ఉదయం 10 గంటలకు, మిగిలిన ఏడు చోట్ల మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ సభలు ఉంటాయని ఎంపీడీవో వినీల్ కుమార్ తెలిపారు. పాలకవర్గాలతో పాటు ప్రజలు పాల్గొని సమస్యల పరిష్కారానికి చర్చించుకోవాలని సూచించారు.

శరన్నవరాత్రులకు ఆలయాల ముస్తాబు

కోట, న్యూస్‌టుడే: కోట, చిట్టమూరు మండలాల్లోని పలు గ్రామ దేవతల ఆలయాలు శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. ఈ క్రమంలోనే ఆలయాలను పవిత్ర జలాలతో శుద్ధి చేస్తున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు రోజూ ప్రత్యేక అలంకరణల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. కోటలోని కోటమ్మదేవత ఆలయం, వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం, గూడలిలోని రామాలింగచాముండేశ్వరిదేవి ఆలయంతోపాటు పలు ఆలయాల్లో ఉత్సవాల ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.



ఎమ్మెల్యే విజయశ్రీకి చెక్కు అందజేస్తున్న అపాచీ ప్రతినిధులు

సీఎం సహాయనిధికి రూ.10 లక్షల విరాళం

నాయుడుపేట : విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి తడ మండలం మాంబట్టుకు చెందిన అపాచీ షూ పరిశ్రమ వైస్ ఛైర్మన్ చింగ్‌చాన్, పీఆర్వో మోహన్ బుధవారం నాయుడుపేట అగ్రహారపేటలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యంను కలిసి రూ.10 లక్షల చెక్కు అందజేశారు. వీరితోపాటు నాయుడుపేట బలిజ కాపు సంఘం నేతలు రూ.1.51 లక్షల చెక్కు అందజేశారు. బలిజ సంఘ నాయకులు అకుల కుబేరు మణి, పగడల శివప్రదీప్, జలంధర్, మోహన్ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

నాయుడుపేట, న్యూస్‌టుడే: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం నాయుడుపేట మండలం మేనకూరులో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చెత్త సంపద కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు.

పంచాయతీరాజ్‌లో అధికారుల బదిలీ

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలోని పంచాయతీరాజ్ శాఖలో పలువురు అధికారుల బదిలీలు జరిగాయి. ఆ మేరకు బుధవారం నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. వాకాడు మండల పరిషత్ కార్యాలయం ఏవోగా ఏఎస్ పేట నుంచి శ్రీనివాసులు, ఈవోపీఆర్డీగా వెంకటగిరి నుంచి ఉమామహేశ్వరరావును నియమించారు. కార్యాలయంలో సీనియర్ సహాయకుడు రవూఫ్‌ను జిల్లా పరిషత్ నెల్లూరుకు, జూనియర్ సహాయకులు సాయిని ముత్యకూరు బదిలీ చేశారు. వారి స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సురేష్ చౌదరిని ఓజిలికి.. ఇక్కడికి గూడూరు ఈఈ కార్యాలయం నుంచి సుమాంజలిని నియమించారు. బ్యారేజీ ఏఈగా ఉన్న సుబ్బారావును పెళ్లకూరు, చిల్లకూరు ఏఈగా ఉన్న కృష్ణయ్యను వాకాడుకు బదిలీ చేశారు. బ్యారేజీ డీఈగా రాపూరు నుంచి ఆనందబాబు నియమితులయ్యారు. గృహ నిర్మాణ శాఖ ఏఈగా ఉన్న వెంకటేశ్వర్లును దక్కిలికి.. ఇక్కడ కోట ఏఈని ఇన్‌ఛార్జిగా ఉన్నతాధికారులు నియమించారు.

రేపు ఉద్యోగ మేళా.. తడ, న్యూస్‌టుడే: తడ బీఈ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. శ్రీసిటీలోని బ్లూస్టార్, బీసీఏ, అమెజాన్ వేర్‌హౌస్, పోర్టు మేనేజ్‌మెంట్ సర్వీసెస్ తదితర సంస్థల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, బీఈ ప్రిన్సిపల్ దేవదానం బుధవారం పేర్కొన్నారు.

నిఘా కమిటీలు ఉత్తుత్తే

● స్థానికంగా ఉండని తహసీల్దార్లు ● క్షేత్రస్థాయిలో వీఆర్వోలు, వీఆర్ఏలే



సూళ్లూరుపేట ప్రాంతంలో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: తహసీల్దార్లు అందరూ పనిచేసే మండల కేంద్రాల్లో తప్పనిసరిగా ఉండాలని, ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణాపై 24×7 నిఘా ఉంచి, కిందిస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుని, ఎక్కడికక్కడ కట్టడి చేయాలని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఇచ్చిన ఉత్తర్వులు ఉత్తుత్తేగానే కనిపిస్తున్నాయి. ఇవి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. కేవలం వీఆర్వోలు, వీఆర్ఏలు మాత్రమే కనిపిస్తున్నారు. దాంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. మాఫియాకు పలుచోట్ల రెవెన్యూ సిబ్బంది, పోలీసులు కొమ్ముకాస్తున్నారు.

డివిజన్ పరిధిలో సూళ్లూరుపేట, ఓజిలి, నాయుడుపేట, పెళ్లకూరు, దొరవారిసత్రం, తడ, సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాలు ఉన్నాయి. ఇక్కడ పనిచేసే కొందరు తహసీల్దార్లు నెల్లూరు, గూడూరు, తిరుపతి, శ్రీకాళహస్తిల్లో నివాసముంటూ విధులకు వచ్చి వెళ్తున్నారు. దాంతో వారికి మండలాల్లో పూర్తిస్థాయిలో పట్టులేకుండా పోయింది. ఇసుక, మట్టి, గ్రావెల్ మాఫియా ఆగడాలు పెచ్చుమీరాయి. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీవో తహసీల్దార్లు అందరూ స్థానికంగా నివాసముంటూ, అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ల ఆధ్వర్యాన ప్రత్యేక కమిటీలు నియమించి, అక్రమ రవాణాపై నిఘా ఉంచి, ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఆదేశాలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కానీ అధికారులలో చీమకుట్టినట్లు కూడా లేదు. రాత్రివేళ పలువురు తహసీల్దార్లు మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండటం లేదు.



ఆర్డీవో కార్యాలయం ఎదురుగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

స్పష్టమైన ఆదేశాలిచ్చాం

డివిజన్‌లోని తహసీల్దార్లు అందరూ 24 గంటలు మండల కేంద్రాల్లో ఉండి, ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని ఆర్డీవో ఆధ్వర్యాన ప్రత్యేక కమిటీలు వేస్తూ ఆదేశాలిచ్చాం. అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

- రవికుమార్, డీఏవో

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046		సమయం
నాయుడుపేట: 80085 73970		10 AM
సూళ్లూరుపేట: 96188 78782		TO
వెంకటగిరి : 80085 73966		1 PM

కోట, న్యూస్‌టుడే:

సమస్య: తిమ్మానాయుడుపాళెం-వెంకన్నపాళెం మార్గంలోని ర.భ రోడ్డు పక్కనే తాగునీటి పైపులైన్ గేట్‌వాల్వు మూత లేకుండా ప్రమాదకరంగా ఉంది. వాహనచోదకులు రాత్రి సమయాల్లో గుంతలో పడి క్షతగాత్రులౌతున్నారు. **- రాగయ్య, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి మూత ఏర్పాటు చేస్తాం. **- అరవింద్, ఏఈ**

నాయుడుపేట పటణం, న్యూస్‌టుడే:

సమస్య: నాయుడుపేట భూపయ్య కాలనీలోని ఓ అపార్టుమెంట్ వద్ద విద్యుత్తు తీగలు చెట్లలో ఇరుక్కుని ఉన్నాయి. సరఫరాకు అంతరాయం లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. **- సుబ్బు, స్థానికుడు**

సమాధానం: తీగలకు అడ్డం లేకుండా చెట్లు తొలగిస్తాం. **- వెంకటస్వామి, ఏఈ**

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:

సమస్య: సూళ్లూరుపేటలోని శ్రీహరికోట రోడ్డులో కుక్కలు సంచరిస్తున్నాయి. దారిన వెళ్లే వారిని వెంబడించి దాడులు చేస్తున్నాయి. **- స్థానికులు, కోళ్లమిట్ట**

సమాధానం: పురపాలక సంఘంలో కుక్కలను పట్టించే విషయమై ఛైర్మన్‌తోపాటు, కౌన్సిల్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుని, ప్రజలకు ఇబ్బందిలేకుండా చేస్తాం. **- చిన్నయ్య, పుర కమిషనర్**

ఘనంగా గాంధీ జయంతి




కోట: విద్యానగర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు, అధ్యాపకులు



గూడూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్



షార్‌లో విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న సంచాలకులు రాజరాజన్



సూళ్లూరుపేటలో గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నేతల పుష్పాంజలి

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో బుధవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, విద్యార్థులు గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతిపిత గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు తెలిపారు. పారిశుద్ధ్య, సేవా కార్యక్రమాలు చేపట్టారు. ర్యాలీలు నిర్వహించారు. ప్రతిజ్ఞలు చేశారు. విద్యార్థులకు ఆటపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. **- న్యూస్‌టుడే బృందం**



వెంకటగిరి: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెదేపా నేతలు

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న డీఎఫ్‌వో శామ్యూల్

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: పర్యావరణ సమతుల్యతలో భాగమైన వన్యప్రాణులను సంరక్షించుకోవడం మనందరి బాధ్యతని సూళ్లూరుపేట వన్యప్రాణి విభాగం డీఎఫ్‌వో శామ్యూల్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా బుధవారం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలోని పర్యావరణ విజ్ఞాన కేంద్రం వద్ద పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 8 వరకు ఈ వారోత్సవాలు జరుగుతాయన్నారు. నేలపట్టు, పులికాట్ పక్షుల రక్షిత కేంద్రాల అధికారులు, మన్నారుపోలూరుకు చెందిన ఆర్ఎంకే పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా

పెళ్లకూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛ గ్రామాల లక్ష్యంగా చేపడుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. జీలపాటూరు, బంగారంపేట గ్రామాల్లో సభలు నిర్వహించారు. సర్పంచులు కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దకాలంగా నిరుపయోగం

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడులోని రెవెన్యూ కార్యాలయానికి అప్పటి వాకాడు పాత తాలూకాను దృష్టిలో ఉంచుకుని తాలూకా పరిధిలోని వాకాడు, కోట, చిట్టమూరు మండలాలకు అధికారులు పర్యటించేలా ఉద్దేశంతో 50 ఏళ్ల క్రితం ఓ జీపును కేటాయించారు. ఆ వాహనం విపత్తు సమయంలోనూ.. ఇప్పటిదాకా అధికారుల పర్యటనలోనూ.. అధికారుల గ్రామాల పర్యటనకు 40 ఏళ్ల పాటు ఎంతో ఉపయోగపడింది. అయితే పదేళ్ల క్రితం వాహనం మరమ్మతుకు గురవడంతో అప్పటి అధికారులు పట్టించుకోలేదు. దాంతో ప్రస్తుతం షెడ్డులో దుస్థితిలో ఉంది.



● గూడూరు పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు బుధవారం పూటుగా మద్యం తాగి.. ద్విచక్ర వానంపై వెళ్తూ అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ని ఢీకొట్టారు. విద్యుత్తు షాక్ తగిలి స్వల్పగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

● గూడూరు పట్టణంలోని ప్రభుత్వం స్టేడియం ప్రాంతంలో మద్యం సేవించిన కొందరు ఆకతాయిలు మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో వారు భయాందోళన చెందుతున్నారు.

యథేచ్ఛగా మద్యం విక్రయాలు

● గాంధీ జయంతి రోజున ఉల్లంఘన
● మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: అసలే గూడూరులో జెండా ఉత్సవం.. ఆపై గాంధీ జయంతి. దీంతో మందుబాబులకు తప్పని నిరాశ. ఇంకేముంది. మద్యం లేక పోతే ఉత్సవంలో కిక్కుండదు. డీజేలో స్టెపులే ఉండవు. ఇదే అదునుగా భావించిన బార్లు, ఎలైట్ మద్యం దుకాణాల యాజమాన్యం తమ వ్యాపారాన్ని బుధవారం చాటుమాటున చేసుకున్నాయి. బార్ల నిబంధన ప్రకారం 11 గంటలకు మూసివేయాల్సి ఉన్నా.. మంగళవారం రాత్రి 12 గంటలు దాకా మద్యం దుకాణాలు తెరిచి వ్యాపారాలు చేశారు. మంగళవారం, బుధవారం రెండు రోజుల్లో సుమారు రూ.30 నుంచి రూ.50లక్షలు వరకు మద్యం విక్రయాలు జరిగాయి. దీనికి తోడుగా గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు, బార్ల వద్ద నిర్వాహకులే బెల్ట్ షాపులు నిర్వహించి ముందుగానే మద్యాన్ని బెల్ట్ దుకాణాలకి తరలించి భద్రపరిచారు. బుధవారం గాంధీజయంతి కావడంతో అధిక ధరలకు విక్రయాలు చేశారు.

ఇంత తంతు జరుగుతున్నా అక్రమ మద్యం అమ్మకాలు కట్టడి చేస్తామని చెప్పిన ఎక్సైజ్ అధికారులు, పోలీస్‌శాఖ ఆచరణలో మాత్రం పట్టించుకోలేదు. మద్యం విక్రయదారుల వెనుక ఎక్సైజ్ అధికారుల పాత్ర ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వదిలేశారని పట్టణ ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీనికి తోడు మద్యం సేవించిన కొంతమంది యువత అసభ్యంగా ప్రవర్తించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విక్రయాలు చేయకుండా తనిఖీలు చేశాం

గాంధీ జయంతి రోజున ఎక్కడా మద్యం విక్రయాలు చేయకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాం. గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు దుకాణాలు లేకుండా చర్యలు తీసుకున్నాం. కొంత మంది ముందురోజు కొని తాగి ఉంటారు.

- కరీమాబేగం, ఎక్సైజ్ సీఐ, గూడూరు

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణ, మండల పరిధిలో మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని ఎక్సైజ్ సీఐ కరిమాబేగం తెలిపారు. ఈ నెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వైద్య వీరరాఘవస్వామి ఆలయంలో పూజలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట మండలం చలివేంద్రం గ్రామం వద్ద బుధవారం వైద్య వీరరాఘవస్వామి ఆలయంలో ఏడాదికొకసారి వచ్చే మహాలయ అమావాస్య పురస్కరించుకుని అభిషేకాలు పూజలు చేశారు. భక్తులు భారీగా చేరుకుని భజనలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

మహాసభలు విజయవంతం చేయండి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 6, 7, 8 తేదీల్లో విజయనగరంలో నిర్వహించే ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి కోరారు. గూడూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో గోడప్రతులను బుధవారం విడుదల చేశారు. నాయకులు కోదండరాం, బాబు, జైపాల్‌రెడ్డి, శివకుమార్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్కులో శుభ్రం చేస్తున్న పుర అధ్యక్షురాలు భానుప్రియ తదితరులు

పరిసరాల శుభ్రత పాటించాలి

వెంకటగిరి, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రత చర్యలను ప్రజలు చేపట్టాలని పుర అధ్యక్షురాలు నక్కా భానుప్రియ పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ● **సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** పట్టణంలోని వీఎస్ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో చెత్తచెదారాలను తొలగించారు.

గొప్ప మేధావి ఏచూరి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ప్రపంచస్థాయి మేధావి ఏచూరి సీతారాం అని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కొనియాడారు. సూళ్లూరుపేటలో బుధవారం సీతారాం సంస్మరణ సభ జరిగింది. సభకు జిల్లా సీపీఎం కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. పుర ఛైర్మన్ శ్రీమంత్‌రెడ్డి, సీపీఐ నేత సుధాకర్‌రెడ్డి, చెంగాళమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ కాళంగి ప్రభాకర్, పట్టణ తెదేపా అధ్యక్షుడు ఆకుతోట రమేష్, సీపీఎం, సీఐటీయూ నేతలు అల్లెయ్య, మోహనరావు, నాగరాజు, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి జెండా ఊరేగింపు

కోట, న్యూస్‌టుడే: కోటలో బుధవారం ఆంజనేయస్వామి జెండాను ఘనంగా ఊరేగించారు. భక్తులు దారి పొడవున కర్పూర హారతులతో కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకొన్నారు.



'భవిష్యత్ దిక్సూచి' ప్రారంభం

ఓజిలి(నాయుడుపేట), న్యూస్‌టుడే: గ్రామీణ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే జాతీయ విద్యా సంస్థల ప్రవేశ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు స్టెప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నైపుణ్యం కలిగిన అధ్యాపకులు టీంగా ఏర్పడి 'భవిష్యత్ దిక్సూచి' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొదటిసారిగా ఓజిలి మండలం దేవునికండ్రిగ ప్రాథమిక పాఠశాలలో గాంధీ జయంతి పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐఐటీఎన్ చైతన్య కృష్ణ, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రమేష్, ఉపాధ్యాయులు పెంచలయ్య, అధ్యాపకులు నాగరాజు నైపుణ్యాల పెంపుపై వివరించారు.



పాఠశాలలో విద్యార్థులతో నిపుణులు

చోరీలకు పాల్పడే నిందితుడి అరెస్టు

తడ, న్యూస్‌టుడే: పట్టపగలు తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడే నిందితుడ్ని తడ పోలీసులు సాంకేతిక పద్ధతులు ఉపయోగించి బుధవారం పట్టుకున్నారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు వివరాల మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా గురుగుబిల్లి గ్రామానికి చెందిన చందక మణికంఠ శ్రీసిటీలో ఒక పరిశ్రమలో పనిచేస్తూ ఇటీవల తడ పంచాయతీ పరిధిలోని సుజాతానగర్‌లో ఒక ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. శ్రీసిటీ, వరదయ్యపాళెం పోలీసు స్టేషన్ల పరిధిలో దాదాపు రెండు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డాడు. మరో ఇంట్లో చోరీకి పాల్పడేందుకు యత్నించగా బుధవారం అదుపులోకి తీసుకుని నిందితుడ్ని అరెస్టు చేశారు. అతని నుంచి 106 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. సీఐ మురళీకృష్ణ, ఎస్సై కొండపనాయుడు తదితరులు పాల్గొన్నారు. నిందితుడ్ని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఎస్సై, సిబ్బందికి డీఎస్పీ రివార్డులు అందించారు.



వెంకటగిరి నీటిపారుదల శాఖ కార్యాలయం

జలవనరుల శాఖలో సిఫార్సులకు చెల్లుచీటి

● రాష్ట్ర స్థాయిలో పరిశీలనతో లబోదిబో
● విధుల్లో చేరని చాలా మంది అధికారులు

గూడూరు, న్యూస్‌టుడే: ఇరిగేషన్ డివిజన్‌లో సిఫార్సులను ఆ శాఖ పక్కన పెట్టేసింది. రాష్ట్ర స్థాయిలో మంత్రి పేషీలో అధికారుల పనితీరును బట్టి బదిలీ ప్రక్రియ చేపట్టారు. దీంతో ఇక్కడ నేతల సిఫార్సుల లేఖలు పక్కకెళ్లినట్లు తెలుస్తోంది. ఇలా ఈఈ నుంచి డీఈఈలు, ఏఈఈల పరిస్థితి ఇదే కాగా కాకా పట్టిన అధికారులు సుదూరంగా బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది.

గూడూరు ఇరిగేషన్ డివిజన్‌లో ఈఈగా పని చేసిన రత్నాకర్‌రెడ్డి యథాస్థానానికి వెళ్లిపోయారు. ఆయన డీఈఈ కాగా వైకాపా ప్రభుత్వం ఎఫ్ఏసీగా తీసుకొచ్చిన గూడూరు డివిజన్ ఈఈగా వేసింది. ఆయన కాలంలో పెద్దఎత్తున ఎఫ్‌డీఆర్ పనులు మంజూరు కాగా రాజకీయ సిఫార్సుల మేరకు పనులు ఎంపిక చేశారన్న ఆరోపణలున్నాయి. ఇలా ఆయన ఇక్కడ కొనసాగడానికి ప్రయత్నించినా విఫలమైనట్లు సమాచారం కాగా ఆయన సత్యవేడు డీఈఈగా వెళ్లిపోయారు. ఇక్కడకి సోమశిల ప్రాజెక్టు నుంచి శ్రీనివాసరావుని వేశారు. ఆయనకు ఎలాంటి సిఫార్సు లేకపోగా ఈఎన్‌సీ కార్యాలయం నుంచి వేసినట్లు సమాచారం.

డీఈఈల విషయానికొస్తే..

నాయుడుపేట డీఈఈ కోటేశ్వరరావు రాపూరు ఇరిగేషన్ సబ్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడికి ఇదే మండలంలో ఏఈఈగా పనిచేసిన ఓ అధికారి ఎఫ్ఏసీగా వేసుకోడానికి తీవ్ర ప్రయత్నాలు చేపట్టారు. అదీ విఫలం కాగా ఆయన స్థానంలో నేరుగా వాకాడు సబ్ డివిజన్‌కి రాపూరులో పనిచేస్తున్న ఆనంద్ బాబును బదిలీ చేశారు. ఇక్కడ ఎఫ్ఏసీగా ఉన్న అధికారిని వెనక్కి తీసుకున్నట్లు సమాచారం. సూళ్లూరుపేట సబ్ డివిజన్‌కి గతంలో ఉన్న వారినే కొనసాగిస్తున్నారు.

ఏఈఈ విషయంలో తర్జన భర్జన

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో చాలా మంది సిఫార్సుల లేఖలు పట్టించుకోలేదని సమాచారం. ఇలా పైనుంచి వారికున్న సమాచారం మేరకు బదిలీలు చేశారు. ఇలా నాయుడుపేట సబ్‌డివిజన్ పెళ్లకూరుకి ఏఈఈగా సుబ్బారావు నియమితులయ్యారు. ఇక్కడ ఏఈఈ మహేష్‌ని నెల్లూరుకు బదిలీ చేశారు. నాయుడుపేట ఏఈని ఓజిలికి అక్కడ ఏఈని నాయుడుపేటకు బదిలీ చేయడం గమనార్హం. కాగా ఏఈఈ విషయంలో ఇంకా సందిగ్ధత నెలకొంది. వారిలో చాలా మంది ఇంకా బాధ్యతలు తీసుకోకపోవడం గమనార్హం.

పుర కమిషనర్ బదిలీ

వెంకటగిరి, న్యూస్‌టుడే: మున్సిపల్ కమిషనర్ రషీద్ చీరాలకు బదిలీ అయ్యారు. బుధవారం పుర కమిషనర్‌ను పుర అధ్యక్షురాలు భానుప్రియ, కౌన్సిలర్లు ఘనంగా సత్కరించారు. వెంకటగిరికి కమిషనర్‌గా నరేంద్రకుమార్ బదిలీపై రానున్నారు.

సనాతన ధర్మ స్థాపనే లక్ష్యం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేశారని, ఆయన బాటలోనే గూడూరు జనసేన నాయకులు పయనిస్తామని ఆ పార్టీ పీఓసీ మోహన్ తెలిపారు. గూడూరు పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. గురువారం తిరుపతిలో నిర్వహించే వారాహి బహిరంగ సభకి గూడూరు నుంచి వేలాది మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తిరుపతికి తరలిరావాలని కోరారు. నాయకులు భాస్కర్, నాగార్జున, సాయికిరణ్, మనోజ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో జనసేన నాయకులు

తప్పిన పెను ప్రమాదం

గూడూరుపట్టణం : పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల సమీపంలో మద్యం తాగి ద్విచక్రవాహనంపై వెళ్తూ ట్రాన్స్‌ఫార్మర్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు విద్యార్థులకు స్వల్పగాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు పట్టణంలోని ఓ ప్రభుత్వ కళాశాల వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్నారు. గూడూరులో జెండా ఉత్సవం కావడంతో మద్యం తాగి ద్విచక్రవాహనంపై గూడూరు- గాంధీనగర్ రోడ్డుపై వెళ్తున్న క్రమంలో పట్టణంలోని ఎస్‌కేఆర్ కళాశాల వద్దకి వచ్చే సరికి ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పైకి దూసుకెళ్లింది. షాక్ కొట్టడంతో విద్యార్థులకి స్వల్ప గాయలయ్యాయి. పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

మద్యం స్వాధీనం

చిట్టమూరు(కోట), న్యూస్‌టుడే: మండలంలో కుమ్మరిపాళెం గ్రామంలో బుధవారం మద్యం విక్రయిస్తున్న చిన్న కోటయ్యని వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ అదుపులోకి తీసుకుని 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.